Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 73 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | సోమవారం 14.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

ఘనంగా ఖైరతాబాద్
గణనాథుడి ఆవిష్కరణ..
నేడే తొలి పూజ

- ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 69 అడుగుల మహాగణపతి
- పంచముఖ సంకటహర రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడు
- మట్టితో పర్యావరణ హితంగా విగ్రహం నిర్మాణం
- సోమవారం గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ
- ఆదివారం నుంచే దర్శనానికి పోటెత్తిన భక్తజనం

2



మోదీ మారథాన్ దౌత్యం..
రెండున్నర రోజుల్లో 15 భేటీలు!

- ఢిల్లీలో విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు
- సదస్సుతో పాటు 15 భేటీల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- రష్యా, చైనా అధ్యక్షులతో పాటు పలువురు ప్రపంచ నేతలతో చర్చలు
- మూడు రోజుల పాటు విరామం లేకుండా కొనసాగిన సమావేశాలు

2



తెలంగాణ ధనిక రాష్ట్రం అవడం
రోశయ్య చలవే
- సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ మిగులు బడ్జెట్‌కు రోశయ్య ముందుచూపే కారణమన్న రేవంత్ రెడ్డి

రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని వెల్లడి

తన ఎదుగుదలకు రోశయ్య సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్న సీఎం

హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహ ఏర్పాటును సమర్థించిన రేవంత్

ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వ సాయం

నిత్యం నిఘా, ఉప్పల్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు.....

2



మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు.. కానీ..! - కొండా సురేఖ



నిత్యం నిఘా, వరంగల్ : తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.

తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్..
సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

- తెలంగాణలో మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం
- మొత్తం 1.51 లక్షలకు పైగా క్రిమినల్ కేసులు పరిష్కారం
- 3,896 సైబర్ ఫ్రాడ్ కేసుల సెటిల్‌మెంట్.. బాధితులకు రూ.42.29 కోట్ల వాపసు
- కేసుల పరిష్కారంలో హైదరాబాద్, ఖమ్మం, గద్వాల యూనిట్లు టాప్

2



భాగ్యనగరంలో తగ్గిన రియల్ జోరు
నిలబెడుతున్న ఐటీ, జీసీసీలు

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధిలో మందగమనం
- నివాస గృహాల అమ్మకాలు తగ్గినా నిలకడగా ఉన్న ధరలు
- రికార్డు స్థాయిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్, జీసీసీలదే కీలక పాత్ర
- రియల్టీకి అండగా నిలుస్తున్న ఐటీ ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు

2



సారీ చెప్పి ఉంటే కొండా సురేఖ
పదవి నిలిచేది : కొండా మురళి



కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోయాక తొలిసారి స్పందించిన కొండా మురళి

పదవి కోసం క్షమాపణ చెప్పేది లేదని సురేఖ తేల్చిచెప్పారని వెల్లడి

2

కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు, రాహుల్ గాంధీనే తమ నాయకుడన్న మురళి

తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణపై అల్పపీడన ప్రభావం.. రెండ్రోజులు వర్షాలే
- ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- గత 24 గంటల్లో పలుచోట్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు
- ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద నీరు.. అప్రమత్తమైన అధికారులు



నిత్యం నిఘా, హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది....

2

Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

తెలంగాణలో దంచికొడుతున్న వానలు..
పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

మొదటిపేజీ తరువాయి.. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి. ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్..
సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు. కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (TGLSA), జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు (DLSA), పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం సాధ్యమైందని డీజీపీ తెలిపారు. ఈ సమన్వయంతో కూడిన ప్రయత్నం వల్ల లోక్ అదాలత్ గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

భాగ్యనగరంలో తగ్గిన రియల్ జోరు...
నిలబెడుతున్న ఐటీ, జీసీసీలు

మొదటిపేజీ తరువాయి.. కొన్నేళ్లుగా అనూహ్యమైన వృద్ధిని నమోదు చేసిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కాస్త నెమ్మదించింది. నివాస గృహాల విక్రయాలు మందగించినప్పటికీ, రికార్డు స్థాయిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణతో ఉద్యోగాల ఆధారిత డిమాండ్ బలంగా ఉంది. దీంతో రియల్టీ రంగం కుప్పకూలిపోయే ప్రమాదం ఏమీ లేదని, కాస్త జాగ్రత్తపడే దశలోకి ప్రవేశించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, 2026 ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో 19,249 నివాస గృహాల అమ్మకాలు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే కేవలం ఒకశాతం మాత్రమే అధికం. కొత్త ప్రాజెక్టుల ప్రారంభం 2 శాతం తగ్గి 20,466 యూనిట్లుగా నమోదైంది. అయితే, ఇళ్ల సగటు ధరలు మాత్రం 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,258కి చేరాయి. అమ్ముడుకాని ఇళ్ల సంఖ్య 3 శాతం పెరిగి 56,095 యూనిట్లకు చేరింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలు ఇప్పటికీ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అయితే, క్రెడాయ్ హైదరాబాద్–క్రి మ్యాటిక్స్ నివేదికలో భిన్నమైన గణాంకాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్ధంలో అమ్మకాలు 13 శాతం తగ్గి 26,068 యూనిట్లుగా నమోదయ్యాయి. మొత్తం మీద హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక పరిణితి చెందిన దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాలు, అందుబాటు ధర వంటి అంశాలే భవిష్యత్తులో ఈ రంగం వృద్ధిని నిర్దేశించనున్నాయని స్పష్టమవుతోంది.

సారీ చెప్పి ఉంటే కొండా సురేఖ పదవి నిలిచేది : కొండా మురళి

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన తర్వాత ఆమె భర్త, కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి తొలిసారిగా స్పందించారు. వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము పార్టీ మారుతున్నామంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. పదవి కోసం ఆత్మగౌరవాన్ని పదులుకోబోమని, కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. "ఒక్కసారి సారీ చెబితే చాలని నాయకులు సురేఖతో అన్నారు. కానీ, పదవి ఉంటే ఉండనీ, పోతే పోనీ, క్షమాపణ మాత్రం చెప్పనని సురేఖ కరాఖండిగా చెప్పింది" అని మురళి అనాటి పరిణామాలను వివరించారు. పదవులు ఈరోజు వచ్చి రేపు పోతాయని, కానీ కృతజ్ఞత తమ రక్తంలో, కుటుంబంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తమ విధేయత కాంగ్రెస్ పార్టీకేనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వల్లే సురేఖకు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం వచ్చిందని, ఆయన్ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని కొండా మురళి ప్రకటించారు. "వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు మేమే టికెట్లు ఇస్తాం" అంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ వంటి నేతలు కూడా ఎన్నో పోరాటాలు చేసి పైకి వచ్చారని గుర్తుచేశారు. త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు. ఈ సందర్భంగా కొండా మురళి భావోద్వేగానికి గురయ్యారు. "నా శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయి, అయినా ఇంకా బతికే ఉన్నాను" అని అన్నారు. తానూ, సురేఖ ఒకే మాటపై ఉంటామని, అయితే తమ కుమార్తె రాజకీయ భవిష్యత్తు ఆమె ఇష్టమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో కొండా దంపతులు కాంగ్రెస్‌లోనే కొనసాగుతారని స్పష్టత వచ్చినట్లయింది.

తెలంగాణ ధనిక రాష్ట్రం అవడం రోశయ్య చలవే

మొదటిపేజీ తరువాయి.. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్యవైశ్యులు సౌమ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు ఆర్యవైశ్య వర్గానికి చెందినవారేనని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదని పేర్కొన్న సీఎం, ఈ ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల అవసరాలు తీర్చాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ.. నేడే తొలి పూజ

మొదటిపేజీ తరువాయి.. భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువు దీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు. ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు. ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని మరో ప్రసిద్ధ గణపతి మండపమైన బాలాపూర్‌లో ఈ ఏడాది పూరీ జగన్నాథ్ ఆలయ థీమ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.



మోదీ మారథాన్ దౌత్యం.. రెండున్నర రోజుల్లో 15 భేటీలు!

మొదటిపేజీ తరువాయి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు, ఆయన నిబద్ధతకు అద్దం పట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కేవలం రెండున్నర రోజుల వ్యవధిలో, ప్రధాని మోదీ ఏకంగా 15 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి తన దౌత్య వేగాన్ని చాటుకున్నారు. ఈ అధికారిక సమావేశాలే కాకుండా, బ్రిక్స్ సదస్సు సెషన్లు, ఔట్‌రీచ్ సమావేశాల మధ్యలో పలువురు ప్రపంచ నేతలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులతో కూడా ఆయన అనేక పుల్-అసైడ్ (అనధికారిక) సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలతో ప్రధాని మోదీ ఈ దౌత్య మారథాన్‌ను ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం హైదరాబాద్ హౌస్‌లో ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో చర్చలతో రోజును ప్రారంభించిన మోదీ, ఆ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్, వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌లతో వరుసగా సమావేశమయ్యారు. అనంతరం బ్రిక్స్ సదస్సులో పాల్గొని, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కీలక ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. సదస్సులో భాగంగా 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను తిలకించడం, నేతలతో కలిసి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆదివారం కూడా ప్రధాని సమావేశాల పరంపర ఆగలేదు. బ్రిక్స్ భాగస్వామ్య, ఔట్‌రీచ్ దేశాల నేతలతో భేటీ అనంతరం, కజకిస్థాన్ ప్రధాని, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు, ఈజిప్ట్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, బురుండి అధ్యక్షుడు, నైజీరియా ఉపాధ్యక్షుడు, ఉగాండా ఉపాధ్యక్షురాలితో ఒకరి తర్వాత ఒకరితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మొత్తం మీద, బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీ చూపిన చొరవ, ఆయన జరిపిన వరుస సమావేశాలు ప్రపంచ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలన్న భారత్ సంకల్పాన్ని మరోసారి స్పష్టం చేశాయి.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హైటెక్ భద్రత..
తొలిసారిగా సరికొత్త టెక్నాలజీల వినియోగం

నిత్యం నిఘా, తిరుమల :
తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఈసారి భద్రత విషయంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడం, అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చూడటం లక్ష్యంగా అధునాతన టెక్నాలజీలను ప్రవేశపెడుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలు, నెట్‌వర్క్ స్లైసింగ్ వంటి టెక్నాలజీలతో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తోంది.

తొలిసారిగా నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీ
గరుడ సేవ వంటి ప్రధాన ఘట్టాల సమయంలో మాడ వీధులకు సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇంత భారీ రద్దీ ఉన్నప్పుడు సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడం, వాకీటాకీల ఫ్రీక్వెన్సీలు ఓవర్‌ల్యాప్ కావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని అధిగమించేందుకు జియోతో కలిసి ప్రయోగాత్మకంగా 'నెట్‌వర్క్ విత్‌ిన్ ది నెట్‌వర్క్' పేరుతో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీని అమలు చేస్తోంది. దీని కింద 30 అధునాతన కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. సాధారణ సిగ్నల్స్ జామ్ అయినా, ఈ పరికరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై పని చేస్తాయి. 11 కీలక స బ్- క ంట్రోల్ పాయింట్ల వద్ద ఉన్న తాధికారులకు వీటిని అందించనున్నారు.




రద్దీని అంచనా వేయనున్న ఏఐ కెమెరాలు
గ్యాలరీల్లో భక్తుల రద్దీని కచ్చితంగా అంచనా వేసేందుకు ఈసారి తొలిసారిగా ఏఐ, సాఫ్ట్‌వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇందుకోసం దాదాపు 200 కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్యాలరీలను గ్రిడ్లుగా విభజించి, ప్రతి గ్రిడ్‌లో ఉన్న భక్తుల సంఖ్యను ఈ కెమెరాలు రియల్ టైంలో లెక్కిస్తాయి. ఏదైనా గ్యాలరీ సామర్థ్యానికి మించి నిండిపోతే, వెంటనే అప్రమత్తమై భక్తులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించేందుకు ఇది దోహదపడుతుంది.

తోపులాటల నివారణకు కొత్త ఎగ్జిట్ ప్లాన్
గ్యాలరీల నుంచి భక్తులు ఒకేసారి బయటకు వచ్చే సమయంలో తోపులాటలు జరగకుండా ఈసారి దిశల వారీగా కొత్త ఎగ్జిట్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. ఏ మాడ వీధిలో ఉన్న భక్తులు అదే దిశలో బయటకు వెళ్లేలా మార్గాలను నిర్దేశించారు. దక్షిణ మాడ వీధిలోని భక్తుల కోసం ఎస్-3 గేట్ వద్ద ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వారు నేరుగా ఆర్టీసీ బస్సుల్లో తిరుపతి లేదా తిరుమల బస్టాండ్‌కు చేరుకోవచ్చు.

మొత్తం మీద సుమారు 3,000 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అలిపిరి టోల్‌గేట్, నడక మార్గాల వద్ద ఫేషియల్ రికగ్నిషన్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను అమర్చారు. విజిలెన్స్, పోలీసు సిబ్బంది కలిపి 5,300 మందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. తిరుమలలో 4,600 వాహనాలకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉండటంతో ఆ పరిమితి దాటితే తిరుపతిలోని ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలకు వాహనాలను మళ్లిస్తారు.

Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 3



పటేల్ విగ్రహానికి పాలాభిషేకం

- తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బీజేపీ
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలతో చరిత్రను విస్మరిస్తున్నాయి : గంట రవికుమార్





వరంగల్ తూర్పు, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వెంకట్రామ జంక్షన్‌లోని భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్ పాలతో శుద్ధి చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన పాత్ర అజరామరమని అన్నారు. ప్రజలకు స్వేచ్ఛా వాయువులు అందించేందుకు పటేల్ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించాయని గంట రవికుమార్ విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ చరిత్రను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక నిర్దిష్ట వర్గం ఓటు బ్యాంకు రాజకీయాలకు లొంగిపోయి, ఎంఐఎం ఒత్తిళ్లకు తలొగ్గి విమోచన దినోత్సవాన్ని విస్మరించిందని ఆయన ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహనీయుల చరిత్రను కనుమరుగు చేసే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా తెలంగాణ విమోచన దినోత్సవ నిర్వహణలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ చరిత్ర, అమరవీరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, మార్టిన్ లూథర్, బైరి శ్యాంసుందర్, మాచర్ల దీనదయాల్, గోగికార్ అనిల్ కుమార్, అంకాల జనార్ధన్, సోముల రతన్, కూచన క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల జోరుతో జనం బేజారు!

- ప్రధాన రహదారులపైనే విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- ఎంఆర్‌పీ కంటే రూ.60 వరకు అదనపు వసూళ్లు..
- పట్టించుకోని అధికారులు ఎవరి కోసం?





ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని పలు గ్రామాల్లో అనధికారికంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం బెల్ట్ షాపుల దందా జోరందుకోవడంతో ప్రజలు బేజారవుతున్నారు. గ్రామాల ప్రధాన రహదారుల వెంబడి సైతం విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్ట్ షాపుల కారణంగా యువత మద్యానికి బానిసై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ధరల విషయంలోనూ వినియోగదారులపై అదనపు భారం పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, బెల్ట్ షాపుల్లో మాత్రం దానికి అదనంగా మరో రూ.40 వరకు పెంచి విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఒక్క మద్యం సీసాపైనే రూ.60 వరకు అదనపు భారం పడుతోందని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని వాపోతున్నారు. అదనపు ధరలపై ప్రశ్నిస్తే తమకు వివిధ రకాల ఖర్చులు, అధికారులకు చెల్లింపులు ఉంటాయని, ఆ భారాన్ని ధరల రూపంలో వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి వస్తోందని కొందరు బెల్ట్ షాపుల నిర్వాహకులు చెబుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే నిజంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయిస్తే ఇలాంటి అదనపు చెల్లింపుల అవసరం ఎందుకు వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు మాత్రం మినరల్ వాటర్, చల్లటి బీర్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నట్లు సమాచారం. అయితే సౌకర్యాల పేరుతో నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, మద్యం దుకాణాల నిర్వహణ సమయాలపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం దుకాణాలను నిర్ణీత సమయాల్లో నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ముందుగానే మూసివేసి, ఆ తర్వాత బెల్ట్ షాపుల ద్వారా మద్యం అందుబాటులోకి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మద్యం ప్రియులు బెల్ట్ షాపులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు.

- బెల్ట్ షాపులకు అనుమతులున్నాయా?

తాడ్వాయి మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్ట్ షాపులకు అధికారిక అనుమతులు ఉన్నాయా? ఉంటే వాటి వివరాలు ఏమిటి? లేకుంటే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. బెల్ట్ షాపులపై ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణ, అక్రమ మద్యం విక్రయాల నిరోధం, అధిక ధరల వసూళ్లపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ప్రజలు గుర్తుచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అనధికారిక మద్యం విక్రయాలు, అధిక ధరల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిత్యం నిఘా ప్రశ్న:

తాడ్వాయి మండలంలోని బెల్ట్ షాపులపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారా? అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది అధికారికంగా తేల్చుతారా? ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటారా? ప్రజల ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 4

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

- ప్రజా ఉద్యమాలతో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ

ఏటూరునాగారం, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(ఎం) ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకొని ఏటూరునాగారం ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.డి. దావూద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీరెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమమని అన్నారు. వేలాది మంది రైతులు, కూలీలు, పేద ప్రజలు పోరాటంలో పాల్గొని అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, రహదారులు, పోడు భూములు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ముందుండాలని సూచించారు.



*** ఏచూరి ఆశయాలే ముందుకు తీసుకెళ్లాలి**

సీతారాం ఏచూరి జీవితాంతం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, కార్మికులు, రైతుల హక్కుల కోసం పోరాడారని సాంబశివ అన్నారు. మతతత్వ శక్తుల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఏచూరి ఆశయాలను ఆచరణలోకి తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏటూరునాగారం ప్రాంతంలోని గిరిజనులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యలను గుర్తించి వారిని సమీకరించి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రఘుపతి, జిల్లా కమిటీ సభ్యులు దామోదర్, ఎస్. మల్లారెడ్డి, బచ్చలి కృష్ణబాబు, రత్నం ప్రవీణ్, టి. రవి, గొంది రాజేష్, జాగటి చిన్న, సీనియర్ నాయకులు జమాల్, మండల కమిటీ సభ్యులు ఎం.డి. యాకూబ్, బండారి నరసింహులు, తోలం కృష్ణయ్య, శాఖ కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కులానికి ప్రత్యేక సంకేతం కేటాయించాలి

- **బీసీ కులగణనలో ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలి**
- **బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ డిమాండ్**

హన్మకొండ, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్రంలో నిర్వహించనున్న బీసీ కులగణనకు అనుకూలంగా శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్ తెలిపారు. హనుమకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా శాసనసభ నుంచి బీజేపీ సభ్యులు వాకౌట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెనుకబడిన వర్గాల హక్కుల విషయంలో ప్రతిపక్షాల చిత్తశుద్ధికి ఈ చర్య నిదర్శనమని విమర్శించారు.



★ ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య

దేశవ్యాప్తంగా నిర్వహించే సాధారణ జనగణనలో బీసీ, ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. కులాల వారీగా కచ్చితమైన జనాభా వివరాలు అందుబాటులో ఉంటేనే జనాభా ప్రాతిపదికన సంక్షేమ కార్యక్రమాలను రూపొందించడానికి, వాటి ప్రయోజనాలను అర్హులైన వర్గాలకు సమర్థవంతంగా అందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు.

★ జనాభా ఆధారంగానే న్యాయం

కులాల వారీగా సమగ్ర, స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి వస్తే చట్టసభల్లో రాజ్యాంగబద్ధమైన ప్రాతినిధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మరింత స్పష్టత వస్తుందని వేణుగోపాల్ గౌడ్ పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ కులగణన ప్రక్రియను పారదర్శకంగా, శాస్త్రీయంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీ జనాభాకు సంబంధించిన కచ్చితమైన గణాంకాల ఆధారంగా భవిష్యత్ విధానాలు, సంక్షేమ పథకాలు రూపొందిస్తేనే వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం మరింత సమర్థవంతంగా అందుతుందని ఆయన అన్నారు.

కాంగ్రెస్‌ను వీడేది లేదు.. రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

- **పదవి ఉన్నా.. లేకున్నా ప్రజల్లోనే ఉంటాం**
- **తూర్పులో 24 మంది కార్పొరేటర్లను గెలిపిస్తాం: కొండా దంపతులు**



వరంగల్, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేస్తామని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ తెలిపారు. ఆదివారం వరంగల్‌లోని ఎం.కె. నాయుడు హోటల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా దంపతులు పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ.. కొండా దంపతులు కాంగ్రెస్ పార్టీని వీడబోరని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. పదవులు వస్తుంటాయని, పోతుంటాయని.. కానీ కృతజ్ఞత అనేది తమ కుటుంబంలో విలువగా కొనసాగుతుందని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 24 మంది కార్పొరేటర్లను గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ టికెట్లు దక్కుతాయని పేర్కొన్నారు. తమను నమ్ముకుని అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని అన్నారు. కార్యకర్తలే కొండా దంపతుల బలమని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. "నా శరీరంలో ఇప్పటికీ నాలుగు బుల్లెట్లు ఉన్నాయి. మీ ఆశీస్సులే నన్ను బతికిస్తున్నాయి" అని కొండా మురళి భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.

*** పదవి ఒక అలంకారం మాత్రమే**

మాజీ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. విలువలకు కట్టుబడి రాజకీయాలు చేస్తామని, పదవి ఉన్నా లేకపోయినా ప్రజల్లోనే ఉంటూ ప్రజాసేవ కొనసాగిస్తామని తెలిపారు. గత పది రోజులుగా తమను నమ్ముకున్న కార్యకర్తలు మనోవేదనకు గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు అప్పగించిన పదవికి ఎలాంటి మచ్చ తీసుకురాలేదని పేర్కొన్నారు. మంత్రి పదవి పోయినందుకు బాధ లేదని, అయితే కారణం లేకుండా పదవి నుంచి తొలగించారనే వేదన మాత్రం ఉందన్నారు. "పదవి అనేది కేవలం అలంకారం మాత్రమే. పదవి లేకపోయినా ప్రజల్లోనే ఉంటాం. మళ్లీ మంచి రోజులు వస్తాయి" అని సురేఖ అన్నారు.

*** అవకాశవాద రాజకీయాలపై విమర్శలు**

ప్రస్తుత రాజకీయాల్లో అవకాశవాదం పెరిగిపోయిందని కొండా సురేఖ విమర్శించారు. ఉదయం ఒక పార్టీలో ఉండి సాయంత్రానికి మరో పార్టీలోకి మారే సంస్కృతి పెరిగిందని అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కోసం మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తరువాత రాజకీయ పరిణామాల్లో కేసీఆర్ పిలిచి వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చారని, అప్పట్లో అధికారంలో ఉన్న మంత్రిని ఓడించి తాము గెలిచామని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తనకు మళ్లీ మంత్రి బాధ్యతలు దక్కాయని పేర్కొన్నారు. తమపై మాట్లాడే నాయకులు సంయమనం పాటించాలని సురేఖ సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి తమకు ఫోన్లు వస్తున్నాయని, అయితే పార్టీని వీడే ప్రసక్తి లేదని స్పష్టం చేశామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేస్తామని వెల్లడించారు.

*** తూర్పులో పార్టీ బలోపేతమే లక్ష్యం**

త్వరలోనే కొండా మురళికి చైర్మన్ పదవి దక్కుతుందని సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 24 మంది కార్పొరేటర్లను గెలిపించుకునే దిశగా కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా దంపతులు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

హై వోల్టేజ్‌తో వందల ఇళ్లలో గృహోపకరణాలు ధ్వంసం

- **టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, బోర్లు కాలిపోయి భారీ నష్టం**
- **ట్రాన్స్‌ఫార్మర్ మార్చి సమస్య పరిష్కరించాలని కాపువాడ వాసుల ఆందోళన**



వరంగల్, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేట కాపువాడ యాదవవాడలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ హై వోల్టేజ్ కారణంగా వందలాది గృహాల్లో గృహోపకరణాలు కాలిపోయాయి. ఒక్కసారిగా విద్యుత్ సరఫరాలో అధిక వోల్టేజ్ రావడంతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, బోర్లు తదితర విద్యుత్ పరికరాలు దెబ్బతిని గృహవాసులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఉదయం జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరాలో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

★ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఆందోళన

హై వోల్టేజ్ కారణంగా గృహోపకరణాలు కాలిపోవడంతో కాపువాడలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద స్థానిక గృహవాసులు ఆందోళన చేపట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ డివిజన్ స్థాయి అధికారులు, సహాయ ఇంజినీర్లు స్పందించి పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. హై వోల్టేజ్ కారణంగా నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు ఆదుకోవాలని, కాలిపోయిన గృహోపకరణాలకు నష్టపరిహారం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



క్రెడాయ్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ

- పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల ప్రతిష్ఠకు ప్రోత్సాహం

వరంగల్, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ క్రెడాయ్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. క్రెడాయ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాయిని అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రెడాయ్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించవచ్చని నిర్వాహకులు తెలిపారు. మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా చెరువులు, నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 5

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- పర్యావరణహిత కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ప్రకృతి వనరులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని కోరారు. ఆదివారం హనుమకొండ మున్సిపల్ గెస్ట్‌హౌస్ సమీపంలో శివకుమార్ నిర్వహిస్తున్న మట్టి గణపతి విగ్రహాల విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. చెరువు మట్టితో సహజసిద్ధంగా, పర్యావరణహితంగా తయారు చేస్తున్న గణపతి విగ్రహాలను పరిశీలించి, వాటి తయారీ విధానం, ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మట్టి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పన్నెండేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు శివకుమార్ కలెక్టర్‌కు వివరించారు. విగ్రహాలను ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారని కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు మట్టితో సహజంగా తయారు చేసిన గణపతి విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితి వేడుకలను నిర్వహించవచ్చన్నారు. మట్టి విగ్రహాల నిమజ్జనం సులభంగా జరుగుతుందని, నిమజ్జనం అనంతరం లభించే మట్టిని చెట్లకు, పొలాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో మట్టి గణపతుల పట్ల ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్న కలెక్టర్, మట్టి వినాయక విగ్రహాల ప్రాధాన్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసే వారికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను పరిరక్షిస్తూ పర్యావరణహితమైన వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు.

పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షల నిర్వహణపై ఆరా
- నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశం



హనుమకొండ, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సందర్శించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పరీక్షా నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య, పరీక్ష నిర్వహణకు సంబంధించిన నిబంధనల అమలు, కేంద్రంలో కల్పించిన తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలపై అధికారులతో ఆరా తీశారు. పరీక్షా నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, అదనపు తహసీల్దార్ రవి తదితరులు పాల్గొన్నారు.

★ రాష్ట్ర పరిశీలకుడితో కలెక్టర్ భేటీ

ఇదిలా ఉండగా హనుమకొండ జిల్లాలో నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షలతో పాటు వడ్డేపల్లిలోని పింగళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలకు రాష్ట్ర పరిశీలకుడిగా నియమితులైన కేకేఎన్ సురేష్ బాబును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన ఈ భేటీలో పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. పరీక్షలు నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించేలా తీసుకున్న చర్యలను పరస్పరం సమీక్షించారు.

బయ్యారంలో నూతన గౌడ సంఘం ఏర్పాటు

-సుమారు 100 గౌడ కుటుంబాల సమక్షంలో నూతన కార్యవర్గం ఎంపిక



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ఏడూళ్ల బయ్యారం, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో బయ్యారం గ్రామంలో నూతన గౌడ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 100 గౌడ కుటుంబాల సమక్షంలో నూతన సంఘాన్ని ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా కోడూరు సత్య నారాయణ గౌడ్, గుండు రమేష్ గౌడ్, అధ్యక్షులుగా ముత్యం సాంబయ్య గౌడ్, ఉపాధ్యక్షులుగా మామిళ్ల శ్రీనివాస్ గౌడ్, బూర బతకయ్య గౌడ్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తెలగాని రాము గౌడ్, సహాయ కార్యదర్శులుగా బంధం రాంబాబు గౌడ్, కోడూరు చిన్న పుల్లయ్య గౌడ్, కోశాధికారిగా గుండు శ్రీనివాస్ గౌడ్, న్యాయ సలహాదారుగా గుండు వెంకట నారాయణ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. గౌడ కుటుంబాల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నూతన సంఘం సమష్టిగా పనిచేయాలని సభ్యులు ఆకాంక్షించారు. గౌడ సంఘాన్ని బలోపేతం చేస్తూ సామాజిక, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అర్థం రాజు మృతి

- పార్థివదేహానికి నివాళులర్పించిన హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన చేసిన సేవలు స్మరణీయం



హనుమకొండ, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా దామెర గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అర్థం రాజు మృతి పట్ల హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అర్థం రాజు మృతి విషయం తెలుసుకున్న వెంటనే దామెర గ్రామానికి చేరుకున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. అర్థం రాజు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అర్థం రాజు అందించిన సేవలు ఎప్పటికీ స్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, స్థానిక సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని అర్థం రాజుకు నివాళులర్పించారు

గోదావరి వంతెన పనుల వద్ద రూ.30 వేల విలువైన ఇనుము చోరీ

- ఐదు క్వింటాళ్ల ఇనుము రాడ్లు మాయం.. పోలీసుల దర్యాప్తు



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): పోతారం గ్రామ శివారులో గోదావరి నదిపై కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనుల వద్ద సుమారు ఐదు క్వింటాళ్ల ఇనుము రాడ్లు చోరీకి గురయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం ఘటన వెలుగులోకి రావడంతో నిర్మాణ సంస్థ సిబ్బందిలో ఆందోళన నెలకొంది. చోరీకి గురైన ఇనుము విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని తెలిపారు. నిర్మాణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది మధ్యాహ్నం 12 గంటల సమయంలో బుర్ర శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ఇనుము రాడ్లు కనిపించడం లేదని సమాచారం అందించారు. దీంతో ఆయన వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా సుమారు ఐదు క్వింటాళ్ల ఇనుము రాడ్లు మాయమైనట్లు గుర్తించారు.

* అనిల్ ప్రమేయంపై ఆరోపణ.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఇనుము చోరీ ఘటనలో స్థానికంగా అనిల్ అనే వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు తన దృష్టికి వచ్చిన విషయాన్ని శ్రీనివాస్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటనపై ఎస్ఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిర్మాణ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు, ఇనుము నిల్వల వివరాలు, ఘటన సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది తదితర అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. చోరీకి గురైన ఇనుమును గుర్తించడంతో పాటు ఘటనకు బాధ్యులైన వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు. చోరీకి గురైన ఇనుము రాడ్లను స్వాధీనం చేసుకుని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుర్ర శ్రీనివాస్ కోరారు.

కృష్ణమూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

- మొక్కల సంరక్షణకు పోలీసుల సహకారం: మంథని సీఐ బుద్ధె స్వామి

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రకృతి ప్రేమికుడిగా గుర్తింపు పొందిన గట్టు కృష్ణమూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుద్ధె స్వామి అన్నారు. ఆదివారం మంథని పోలీస్ స్టేషన్‌లో గట్టు కృష్ణమూర్తిని అభినందించారు. ఈ సందర్భంగా సీఐ బుద్ధె స్వామి మాట్లాడుతూ మంథని ప్రాంతంలో వృక్ష సంపదను పెంపొందించేందుకు కృష్ణమూర్తి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజానికి ఉపయోగపడే విధంగా ఏదో ఒక మంచి పని చేయాలనే సంకల్పంతో మొక్కలు నాటుతూ, వాటి సంరక్షణకు కృషి చేయడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో నాటిన మొక్కలకు సరైన సంరక్షణ లేకపోవడంతో అవి దెబ్బతింటున్న విషయాన్ని కృష్ణమూర్తి సీఐ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన బుద్ధె స్వామి మొక్కల సంరక్షణకు పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సీఐ బుద్ధె స్వామి సూచించారు.

Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 6

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కోతుల బెడదకు గతంలో చెక్..
ఇప్పుడు పట్టించుకునే నాథుడే కరువు

- **గతంలో మెరుగు రాజు చొరవతో ఉపశమనం.. మళ్లీ పెరిగిన కోతుల బెడద**
- **ఇళ్లలోకి చొరబడి హల్‌చల్.. భయాందోళనలో మల్లంపల్లి ప్రజలు**



ములుగు జిల్లా/ మల్లంపల్లి, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): మల్లంపల్లి మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడుతూ హల్‌చల్ చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పాలకవర్గం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కోతుల బెడద తీవ్రంగా ఉన్న సమయంలో కోతుల పరిష్కార కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మెరుగు రాజు చొరవ తీసుకుని కోతులను పట్టించే చర్యలు చేపట్టడంతో కొంతకాలం సమస్యకు ఉపశమనం లభించిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవడంతో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం కోతుల సంఖ్య మళ్లీ పెరిగినా సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు.

*** ఇళ్లలోకి చొరబడి హల్‌చల్**

మల్లంపల్లి ప్రధాన వీధులతో పాటు నివాస ప్రాంతాల్లో కోతులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇళ్ల ఆవరణల్లోకి, వంటగదుల్లోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, వస్తువులను కిందపడేయడం, ఇంటి సామగ్రిని చిందరవందర చేయడం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కోతులు ఒక్కసారిగా ఇళ్లలోకి రావడంతో మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. చేతుల్లో ఆహార పదార్థాలు ఉంటే కోతులు వెంటపడుతున్నాయని, దీంతో బయటకు వెళ్లేందుకు కూడా జంకాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

*** చిన్నారులు, వృద్ధుల్లో భయాందోళన**

కోతుల గుంపులు వీధుల్లో సంచరిస్తుండటంతో చిన్నారులను ఒంటరిగా బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇళ్ల పైకప్పులు, గోడలు, విద్యుత్ స్తంభాలపైకి కోతులు ఎక్కుతూ హల్‌చల్ చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే సమస్యపై చొరవ తీసుకుని చర్యలు చేపట్టినప్పుడు పరిష్కారం సాధ్యమైనప్పుడు, ప్రస్తుతం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పాలకవర్గాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యపై అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

*** ప్రమాదం జరిగాక స్పందిస్తారా?**

కోతుల బెడదను చిన్న సమస్యగా చూడకుండా ప్రజల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని మల్లంపల్లి ప్రజలు కోరుతున్నారు. గతంలో మెరుగు రాజు తీసుకున్న చొరవ తరహాలోనే ప్రస్తుత పాలకవర్గం, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కోతుల బెడదను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే మేల్కొని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కోతులను పట్టించడంతో పాటు వాటిని నిబంధనల ప్రకారం సురక్షిత ప్రాంతాలకు తరలించి, భవిష్యత్‌లో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మల్లంపల్లి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు

- బూర నర్సయ్య కుటుంబానికి పరామర్శ.. ప్రమాదంలో గాయపడిన యువకుడికి భరోసా





వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండలం నార్లవాయి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బూర ప్రకాష్ తండ్రి బూర నర్సయ్య శనివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు ఆదివారం నార్లవాయి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బూర నర్సయ్య మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

*** ప్రమాదంలో గాయపడిన యువకుడికి పరామర్శ**

ఇటీవల ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాగితాల నాగరాజును కూడా నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు పరామర్శించారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, మండల అధ్యక్షుడు సారంగపాణి, వేల్పుల కుమారస్వామి, బుక్క మల్లయ్య, నార్లవాయి గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి అనిల్ రాజ్, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ మాదినేని కోటి, మాదినేని రాజు, దామర కిషోర్, దామెర నవీన్, సింగిరెడ్డి విష్ణు, రొట్టె చిన్న అనిల్, పెండ్లి పురుషోత్తం రెడ్డి తదితర మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపనలో సందడి

- **డప్పు వాయిద్యాలు, పాటలతో ఉత్సాహంగా గణేష్ వేడుకలు**
- **భారీగా పాల్గొన్న సుభాష్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు**



వరంగల్ తూర్పు, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 40వ డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సుభాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉర్సు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గణేష్ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గణేష్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చే సమయంలో డప్పు వాయిద్యాలు, పాటలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన ఏర్పాట్లలో అసోసియేషన్ కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చింతకింద రాజు, అఖిల్, యుగేందర్, అజయ్ తదితరులతో పాటు సుభాష్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

నాగులమ్మ ఆలయంలో ఘనంగా పొట్ట పండగ

- **ఆదివాసీ సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు**
- **చిరుధాన్యాలతో 'ఎన్ను' కట్టి అమ్మవారికి నైవేద్యం**




ములుగు జిల్లా/ మంగపేట, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ నాగులమ్మ ఆలయంలో ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా పొట్ట పండగను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ పూజారులు, వడ్డెలు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగలో భాగంగా ఉదయం ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి స్తంభాలు, గద్దెలను శుద్ధి చేశారు. అనంతరం నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ఇంటి నుంచి డోలి వాయిద్యాల నడుమ కొత్తగా పండిన చిరుధాన్యాలతో తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. పొట్ట పండగలో ప్రధాన ఘట్టంగా పొట్ట దశలో ఉన్న వివిధ రకాల చిరుధాన్యాలను దండలుగా కట్టి ఆలయ ప్రాంగణంలోని నాగులమ్మ అమ్మవారి స్తంభానికి, అలాగే సమ్మక్క, సారలమ్మ, ఘడికమరాజు, పగిడిద్దరాజు, గోవిందరాజు, ఎర్రమ్మ, పోతురాజుల గద్దెల వద్ద ఉన్న స్తంభాలకు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంప్రదాయాన్ని 'ఎన్ను కట్టడం' గా పిలుస్తారు. అనంతరం ఆదివాసీ పూజారులు డోలి వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో జాగారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ నిర్వహణ ట్రస్టు, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో నాగులమ్మ ప్రధాన పూజారులు బాడిశ నాగరమేష్, నవీన్‌తో పాటు వడ్డెలు సోడి సత్యం, కుర్సం పుల్లయ్య, మడకం రమేష్, మడకం రాజేష్, చౌలం శాంత, కుర్సం వీరమ్మ, భవాని, మడకం నాగమణి, సంధ్య, సుప్రజ, సోడి శ్రీను, కుర్సం నాగ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీగా ఇషాక్
పీఆర్వోగా తిరుపతి

- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కీలక బదిలీలు

- శనివారం ఉత్తర్వులు జారీ చేసిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



వరంగల్, సెప్టెంబర్ 13(నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కీలక బదిలీలు చోటుచేసుకున్నాయి. కమిషనరేట్ క్యాంపు క్లర్క్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌రావు, పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న మోహనకృష్ణపై బదిలీ వేటు పడింది. వారి స్థానంలో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏవోగా పనిచేస్తున్న ఇషాక్‌ను కొత్త క్యాంపు క్లర్క్‌గా, సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతిని పౌర సంబంధాల అధికారిగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత నియమించారు.ఈ మేరకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ఇషాక్, తిరుపతి తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనరేట్ వర్గాలు తెలిపాయి.

Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 7

జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న
డా. మల్లాది శ్రీరామ్ రెడ్డి

- ఐదు రాష్ట్రాల నుంచి ఎంపికై ప్రతిష్ఠాత్మక పురస్కారం
- ప్రముఖ శిశువైద్యుడిని ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి); వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ శిశువైద్యుడు డా. మల్లాది శ్రీరామ్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక శిశువైద్య రంగ జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఐదు రాష్ట్రాల నుంచి ఎంపికై ఈ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆయనను ప్రత్యేకంగా సన్మానించి ఘనంగా అభినందించారు. చిన్నారులకు విశిష్ట వైద్య సేవలు అందిస్తూ వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన డా. మల్లాది శ్రీరామ్ రెడ్డిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రశంసించారు. ఐదు రాష్ట్రాల నుంచి ఎంపికై జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి, వైద్య రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం డా. మల్లాది శ్రీరామ్ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. వైద్య వృత్తిలో అంకిత భావంతో సేవలందిస్తూ అనేకమంది చిన్నారులకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్న ఆయన మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.కొంది. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

కోదాడలో ఈ నెల 19న భారీ మెగా జాబ్ మేళా





నిత్యం నిఘా, కోదాడ, సెప్టెంబర్ 13 :
సూర్యాపేట జిల్లా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 19న కోదాడలోని సి.సి.రెడ్డి పాఠశాలలో భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.ఆదివారం అధికారులతో వెబెక్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి ఉత్తీర్ణుల నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసిన అభ్యర్థుల వరకు అందరూ పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.జాబ్ మేళాలో దాదాపు 250కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని మంత్రి వెల్లడించారు. అభ్యర్థులు kodadmegajobmela.com వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని, లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.నమోదు పూర్తయిన అనంతరం ప్రతి అభ్యర్థికి ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో కూడిన అక్నాలెడ్జ్‌మెంట్ అందుతుందని తెలిపారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా 5 కంపెనీల ఇంటర్వ్యూలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.జాబ్ మేళా రోజున అభ్యర్థులు తమ అక్నాలెడ్జ్‌మెంట్ ప్రింటౌట్‌తో పాటు 5 సెట్ల బయోడేటా ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచే ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.గ్రామస్థాయిలో టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని, సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని మండల స్థాయి అధికారులను మంత్రి ఆదేశించారు. సూర్యాపేట, ఉమ్మడి నల్గొండ పరిధిలోని జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులు అధిక సంఖ్యలో నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

విఘ్నాలను తొలగించే వినాయకుడు..
జ్ఞానానికి తొలి పూజ

- గణనాథుని జననం నుంచి గణేష్ చతుర్థి విశిష్టత వరకు ఆధ్యాత్మిక కథనం

(నిత్యం నిఘా స్పెషల్) :
భక్తుల కొంగుబంగారంగా, విఘ్నాలను తొలగించే దేవుడిగా, జ్ఞానానికి అధిపతిగా శ్రీ గణపతి పూజలందుకుంటారు. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించడం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో అనాదిగా వస్తోంది. అందుకే గణపతిని విఘ్నేశ్వరుడు, గణనాథుడు, లంబోదరుడు, గజాననుడు, ఏకదంతుడు వంటి అనేక నామాలతో భక్తులు కొలుస్తారు.

★ పార్వతీదేవి ముద్దుబిడ్డగా జననం

పురాణ కథనం ప్రకారం పార్వతీదేవి తన దేహానికి రాసుకున్న పసుపుతో ఒక బాలుడిని సృష్టించి, తనకు కాపలాగా ఉంచిందని చెబుతారు. తల్లి ఆజ్ఞ మేరకు ఆ బాలుడు ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పరమశివుడిని కూడా బాలుడు అడ్డుకోవడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఆగ్రహించిన శివుడు బాలుడి శిరస్సును ఛేదించాడు. తన కుమారుడికి జరిగిన పరిణామంతో పార్వతీదేవి తీవ్ర ఆగ్రహానికి గురికావడంతో, శివుడు బాలుడికి తిరిగి ప్రాణం పోయాలని నిర్ణయించాడని పురాణాలు చెబుతున్నాయి. ఉత్తర దిశగా ముందుగా కనిపించిన ఏనుగు తలను తీసుకువచ్చి బాలుడికి అమర్చడంతో గజాననుడిగా గణపతి అవతరించాడని విశ్వాసం. అనంతరం శివుడు గణపతిని తన గణాలకు అధిపతిగా నియమించి, ఏ శుభకార్యం ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించాలని వరమిచ్చాడని పురాణ కథనం.

★ గరికతో ప్రత్యేక పూజ

వినాయకుడి పూజలో గరికకు అత్యంత ప్రాధాన్యత ఉంది. గరికను సమర్పించడం ద్వారా గణపతి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఎర్రని పుష్పాలు, మందారం వంటి పూలతోనూ గణపతిని పూజిస్తారు. అలాగే గణపతికి ఇష్టమైనవిగా భావించే వివిధ రకాల పత్రాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం అనేక ప్రాంతాల్లో సంప్రదాయంగా కొనసాగుతోంది.

★ ఉండ్రాళ్లు.. మోదకాలు ప్రీతికరం

గణపతి పూజలో నైవేద్యాలకు ప్రత్యేక స్థానం ఉంది. మోదకం, ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, పులిహోర, చక్కెర పొంగలి వంటి నైవేద్యాలను భక్తులు సమర్పిస్తారు. వీటిలో మోదకాన్ని గణపతికి అత్యంత ప్రీతికరమైనదిగా పురాణ సంప్రదాయంలో భావిస్తారు. మోదకం వెలుపల సాధారణంగా కనిపించినా లోపల తీపిని దాచుకున్నట్లే, మనిషి జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా అంతరంగంలో జ్ఞానం, భక్తి, ఆనందాన్ని నింపుకోవాలనే సందేశానికి అది ప్రతీకగా భావిస్తారు.

★ ఏకదంతుడి వెనుక ఆధ్యాత్మిక సందేశం

గణపతికి ఒక దంతం మాత్రమే ఉండటంతో ఆయనను ఏకదంతుడు అని పిలుస్తారు. వ్యాస మహర్షి మహాభారతాన్ని చెబుతుండగా గణపతి దానిని లిఖించాడనే ప్రసిద్ధ పురాణ కథనం ఉంది. రచనకు ఆటంకం కలగకుండా తన దంతాన్నే కలంగా ఉపయోగించాడని చెబుతారు. జ్ఞానం కోసం త్యాగం చేయడం, లక్ష్య సాధనలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించడం అనే సందేశాన్ని ఈ కథనం అందిస్తుంది.

★ ఎలుకే వాహనం ఎందుకు?

గణపతికి ఎలుక వాహనంగా ఉండటానికీ ఆధ్యాత్మిక అర్థం ఉందని భక్తులు విశ్వసిస్తారు. ఎలుక చీకటిలోనూ దూరి వెళ్లగలగడం, ఎక్కడైనా చేరగలగడం వంటి లక్షణాలకు ప్రతీకగా భావిస్తారు. మనిషిలోని కోరికలు, ఆశలు కూడా అదుపు లేకుండా పరుగులు తీసే ఎలుకలాంటివని.. వాటిని జ్ఞానంతో అదుపులో ఉంచుకోవాలనే సందేశాన్ని గణపతి రూపం అందిస్తుందని ఆధ్యాత్మిక భావన.

★ భక్తి, ఆనందాల పర్వదినం

భాద్రపద శుద్ధ చవితిని గణపతి జన్మదినంగా భావించి దేశవ్యాప్తంగా గణేష్ చతుర్థిని ఘనంగా నిర్వహిస్తారు. ఇళ్లలో, ఆలయాల్లో, వీధుల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వినాయకుడి సన్నిధిలో భక్తులు ఒక్కటై ప్రార్థనలు చేయడం, అన్నదానాలు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సామాజిక ఐక్యతకు కూడా ఈ పండుగ వేదికగా నిలుస్తోంది.

★ గణపతి రూపంలో జీవిత సత్యాలు

గణపతి రూపంలోని ప్రతి అంశం ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆధ్యాత్మిక పండితులు చెబుతారు. పెద్ద తల విశాలమైన ఆలోచనకు, పెద్ద చెవులు ఎక్కువగా వినడానికి, చిన్న కళ్ళు ఏకాగ్రతకు, తొండం పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యానికి, పెద్ద పొట్ట సహనానికి ప్రతీకలుగా భావిస్తారు. అందుకే గణపతి పూజ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు.. జ్ఞానం, సహనం, వినయం, ఏకాగ్రత, త్యాగం, మంచితనం వంటి విలువలను జీవితంలో ఆచరించాలనే ఆధ్యాత్మిక సందేశం.

"వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ
నిర్విఘ్నం కురుమే దేవ శుభకార్యేషు సర్వదా"

అంటూ గణనాథుడిని ప్రార్థించే భక్తులు తమ జీవితాల్లోని విఘ్నాలన్నీ తొలగిపోయి సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, జ్ఞానం కలగాలని కోరుకుంటారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంటా భక్తి వెల్లివిరియాలి.. ప్రతి మనసులో గణపతి అనుగ్రహం నిండాలి.. విఘ్నాలు తొలగి శుభాలు కలగాలి.

ఆకలితో ఉన్న వారికి ఆహార దానం

- ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వద్ద సుమారు 200 మందికి మధ్యాహ్న భోజనం పంపిణీ

నిత్యం నిఘా, హైదరాబాద్, సెప్టెంబర్ 12 :
ఆకలితో ఉన్న వారికి అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారికి మానవతా దృక్పథంతో సహాయం అందించడమే లక్ష్యంగా యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. దీమా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో హైదరాబాద్‌లోని ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వద్ద సుమారు 200 మందికి మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేశారు. క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులతో పాటు రోజువారీ భోజనం కూడా భారంగా మారుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం ఒక పూట భోజనం అందించడం ద్వారా వారికి కొంత ఊరట కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాల్లో ఆకలితో ఉన్న వారిని గుర్తించి, వారికి ఆప్యాయతతో భోజనం అందించారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయడమే నిజమైన మానవత్వానికి నిదర్శనమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కింతల విజయరాణి, ఉపాధ్యక్షురాలు శ్రావ్య అర్పన, కొలిపాక సాయికిరణ్, మొహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొని, కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ అవసరమైన వారికి భోజనం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆకలితో ఉన్న వ్యక్తికి ఒక పూట భోజనం అందించడం కేవలం ఆహారం ఇవ్వడం మాత్రమే కాదని, ఆ సమయంలో అతనికి అండగా నిలవడమని అన్నారు. మానవత్వం, సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని, సమాజంలో అవసరమైన వారిని గుర్తించి వారికి చేతనైన సహాయం అందించాలనే లక్ష్యంతో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించిన దీమా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యానికి, నిర్వాహకులకు ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా మరిన్ని మానవతా కార్యక్రమాలను కలిసి నిర్వహించేందుకు సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలు, ఆకలితో ఉన్న నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన





సమయంలో సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో ఆహార పంపిణీతో పాటు విద్య, వైద్యం, పేద కుటుంబాలకు సహాయం, అత్యవసర పరిస్థితుల్లో మానవతా సేవలు వంటి పలు కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఒక్కరి ఆకలి తీర్చడం చిన్న సహాయం కావచ్చు, కానీ ఆ వ్యక్తికి అది ఆ రోజు అందిన గొప్ప మానవత్వం కావచ్చనే సందేశంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

Nityam Nigha 14.09.26_Layout 1 9/14/2026 7:51 AM Page 8

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

- మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి
- కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ప్రజలు, భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి విగ్రహాలను జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమై, జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. కలుషిత నీటి ప్రభావంతో ప్రజల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్న ఆయన.. సంప్రదాయబద్ధంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గణేష్ ఆగమన్ వేడుకల్లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు

- యువతతో కలిసి గణనాథుడికి ఘన స్వాగతం





వరంగల్, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశీబుగ్గ ప్రాంతంలో షణ్ముఖ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఆగమన్ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. యువతతో కలిసి భక్తిశ్రద్ధలతో గణనాథుడికి స్వాగతం పలికిన ప్రదీప్ రావు.. వినాయక చవితి వేడుకలను భక్తి, శ్రద్ధ, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని యువతకు సూచించారు. గణేష్ ఆగమన్ కార్యక్రమంలో స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, కందిమల్ల మహేష్, కొమాకుల నాగరాజు, రత్నం కృష్ణకిషోర్, మామిడాల సతీష్, బైరి హరీష్‌తో పాటు స్థానిక నాయకులు, షణ్ముఖ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగదీశ్వర్ గౌడ్, నల్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో

లేబర్ కార్డుల పంపిణీ..





నిత్యం నిఘా, చందానగర్, సెప్టెంబర్ 13 : శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధి లోని పీజేఆర్ స్టేడియంలో రాష్ట్ర ఐఎన్టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు అవగాహన సదస్సు మరియు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ హాజరై కార్మికులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు తీసుకోవడం వల్ల తెలంగాణ ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ పథకాలను పొందవచ్చని అన్నారు. ప్రమాద మరణానికి రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.1.30 లక్షలు , అంత్యక్రియల ఖర్చు, వైకల్యానికి రూ.5 లక్షల వరకు సాయం, ఆడబిడ్డ పెళ్లికి రూ.30,038, ప్రసూతి సాయం రూ.30,038, ఉచిత వైద్యం, ఈ స్ ఐ , ఈ పి ఫ్ , పిల్లలకు స్కాలర్ షిప్, ఉచిత టూల్ కిట్లు, నైపుణ్య శిక్షణ వంటి ప్రయోజనాలు లేబర్ కార్డు ద్వారా లభిస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో లేబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి వీర బొమ్మ రమేష్, లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు వీరమల్ల వీరేందర్ గౌడ్, ఉయ్యూరు శ్రీదేవి, డిసిసి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి,లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ ముద్దంగుల తిరుపతి లేబర్ సెల్ శేర్లింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు మాదిరెడ్డి మోహన్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కట్ట శేఖరరెడ్డి,వీరమల్ల సంగీత వీరేందర్ గౌడ్, , శేరిలింగంపల్లి నియోజక వర్గం లేబర్ సెల్ జనరల్ సెక్రెటరీ బి. నాగరాజు, శేరిలింగంపల్లి నియోజకవర్గం లేబర్ సెల్ సెక్రెటరీ నగరపు జాన్సన్, లేబర్ సెల్ మియాపూర్ డివిజన్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి,లేబర్ సెల్ శేర్లింగంపల్లి డివిజన్ అధ్యక్షులు పల్లె వెంకట రెడ్డి,లేబర్ సెల్ చందనగర్ డివిజన్ అధ్యక్షురాలు శాంత, ఉపాధ్యక్షురాలు నజియా బేగం, మూర్తి, మాణిక్యం, రాబర్ట్, రమేష్, గోపాల్ ,శాంతమ్మ, ఐ న్ టీ యూ సి, లేబర్ సెల్, కాంగ్రెస్ నాయకులు, నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో 8,288 కేసుల పరిష్కారం

- సైబర్ బాధితులకు రూ.93.30 లక్షలు తిరిగి చెల్లించాలని కోర్టు ఆదేశాలు



వరంగల్ పోలీస్ కమిషనరేట్, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. రాజీకి అవకాశం ఉన్న వివిధ కేసుల్లో మొత్తం 8,288 కేసులను పరిష్కరించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 1,595, ఈ-పెట్టి కేసులు 2,171, మోటార్ వాహన చట్టం కేసులు 4,522, సైబర్ క్రైమ్ కేసులు 134 ఉన్నాయి. సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు సంబంధించిన వివిధ బ్యాంకు ఖాతాల్లో నిలుపుదల చేసిన రూ.93,30,616 మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయాలని కోర్టులు ఉత్తర్వులు జారీ చేశాయి. రాజీ మార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. అలాగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేందుకు సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేశవపూర్ రజక సంఘం అధ్యక్షుడిగా

ముప్పు రమేష్ బాబు

- ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



హనుమకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండలం కేశవపూర్ రజక సంఘం అధ్యక్షుడిగా ముప్పు రమేష్ బాబు నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రజక సంఘం అభివృద్ధికి రమేష్ బాబు కృషి చేయాలని, సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు మరింత సమర్థవంతంగా పనిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు తీగల విక్కి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఈర దయాకర్, పోలు అశోక్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పులి కృష్ణ, గడిపి నాగరాజు, ఈర మహేందర్, పోలు కుమార్, ఈర ప్రభాకర్, ముప్పు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com